సాక్షి
వైఎస్సార్ జిల్లా

గురువారం । 6 । ఏప్రిల్ । 2023



వైభవం..ఉరుసు ఉత్సవం

కమలాపురం దర్గాలో ఉరుసు మహోత్సవాలు బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. -8లో..



ఆటోడ్రైవర్ నిజాయితీ

ఆటో డ్రైవర్ బాలి పోగురాజా తన ఆటోలో మరచిపోయిన బ్యాగును బాధితులకు అప్పజెప్పి నిజాయితీ చాటుకున్నాడు. -8లో..

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
కడప	6.31	4.54
ప్రొద్దుటూరు	6.29	4.56
పులివెందుల	6.34	4.57



భక్త జన సందోహంతో నిండిపోయిన స్వామి వారి కల్యాణ వేదిక ప్రాంగణం (ఇన్‌సెట్) సీతారాములకు శ్రీవారి తరఫున టీటీడీవారు పంపిన కానుకలు



ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు

రమణీయం.. రాములోరి కల్యాణం

- పండు వెన్నెల్లో కమనీయ వేడుక
- తరలివచ్చిన అశేష భక్తజనం
- టీటీడీ ఆధ్వర్యంలో విశేష పూజలు
- పులకించిన ఏకశిలానగరం

ఒంటిమిట్ట: ఏకశిలానగరి ఒంటిమిట్టలో కోదండరాముడి కల్యాణం కమనీయంగా సాగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పండు వెన్నెలలో సీతారాముల కల్యాణం అత్యంత వేడుకగా జరిగింది. ఈ శుభవేళ శిల్పకళాశోభితమైన కల్యాణ మండపం వైకుంఠాన్ని తలపించింది. ఒంటిమిట్ట కోదండ రాముడి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం తరఫున సతీసమేతంగా రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు కల్యాణ వేదిక వద్ద స్వామి వారికి సమర్పించారు.

సంప్రదాయంగా ఎదుర్కోలు ఉత్సవం

కోదండ రామాలయంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు సీతారాముడికి నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం సాంప్రదాయబద్ధంగా సాగింది. తొలుత టీటీడీ వారి ఆధ్వర్యంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి దంపతులు అందజేసిన శ్రీవారి బంగారు కిరీటాలు, నూతన పట్టు వస్త్రాలను శ్రీ సీతారామచంద్ర స్వామి ఉత్సవ వరులకు తొడిగి, వివిధ పుష్పాలతో అలంకరించారు. ఉత్సవ వరులను పల్లకిపై కొలువుదీర్చి ప్రధాన అలయం నుంచి మంగళవాయిద్యాల మధ్య భక్తుల జయజయ ధ్వానాలతో కల్యాణ మండపం వద్దకు తీసుకు వచ్చారు. వేదిక పైన సింహాసనంపై కల్యాణ మూర్తులను కొలువుదీర్చారు. అనంతరం పూజా సామగ్రిని సంప్రోక్షణ జరిపి విశ్వక్సేన పూజ నిర్వహించారు. అనంతరం కల్యాణ క్రతువుకు శ్రీకారం చుట్టారు. నును సిగ్గుల మొలకైన సీతమ్మ నొసటన కల్యాణ బొట్టును, బుగ్గన కాసింత దిష్టిచుక్క పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమర్పించిన పట్టువస్త్రాలను ధరింపజేసి సీతమ్మను పెళ్లికూతురిగా ముస్తాబు చేశారు. అదే రీతిలో సర్వాభరణ భూషితుడిగా శ్రీరాముడిని అలంకరించి సీతమ్మ ఎదుట కొలువుదీర్చారు. తరువాత లోకక్షేమం కోసం మహా సంకల్పం పఠించి కన్యాదానం, గోదానం కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద పండితుల చతుర్వేద పఠనం, భక్తుల రామనామ స్మరణ మధ్య హస్త నక్షత్రయుక్త లగ్నంలో రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య సీతారాముల శిరస్సులపై జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉంచారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ శాస్త్ర వేదపండితులు మంగళసూత్రాన్ని భక్తులకు చూపించి సాక్షాత్తూ లక్ష్మీనారాయణుడైన శ్రీరామ చంద్రమూర్తి చేత, శ్రీ మహా లక్ష్మీ స్వరూపిణీ సీతాదేవికి శాస్త్రోక్తంగా మంగళసూత్రధారణ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సమర్పించిన ముత్యాల తలంబ్రాలు కల్యాణ మూర్తుల శిరస్సుపై పోస్తూ కన్నుల పండువగా కల్యాణం జరిపారు. ఈ అద్భుత కల్యాణ ఘట్టానికి కనులారా వీక్షించిన భక్త జనం మురిసి పోయారు.

- స్వామి వారి కల్యాణాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ అన్బురాజన్, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు వీక్షించారు.



ముత్యాల తలంబ్రాలను సీతారాములకు సమర్పిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



ఒంటిమిట్టలో కల్యాణ వేడుక సందర్భంగా కళాకారుల ప్రదర్శన



మంగళ సూత్రానికి నమస్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు

న్యూస్‌రీల్

కట్టుదిట్టంగా పది పరీక్షలు

ఖాజీపేట: జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి తెలిపారు. ఖాజీపేటలోని మోడల్ స్కూల్‌లో పరీక్షల నిర్వహణపై అనేక ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ప్రత్యేక పరిశీలన కోసం ఆయన బుధవారం పాఠశాలను సందర్శించారు. స్కూల్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

పింఛన్ల పంపిణీ 91.37 శాతం

కడప రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక కింద జిల్లా వ్యాప్తంగా వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. మొత్తం 2,54,089 మంది పింఛన్లకుగాను రూ. 70,12,26,750 పంపిణీ చేయాల్సి ఉంది. అందుకుగాను బుధవారం సాయంత్రం 4.00 గంటల సమయానికి మొత్తం 2,32,162 మంది పింఛన్లకుగాను మొత్తం రూ. 64,06,39,000 పంపిణీ చేశారు. దీంతో 91.37 శాతం పింఛన్ల పంపిణీ నమోదైంది.

ఏసీబీ హెడ్‌కానిస్టేబుల్‌కు పోలీసు సేవాపతకం



సి.కిరణ్

కడప అర్బన్: రాష్ట్రంలో ఉగాది సందర్భంగా అవినీతి నిరోధకశాఖ విభాగంలో పనిచేస్తున్న డీఎస్పీ నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు విశేష సేవలందించిన వారికి పోలీసు సేవాపతకాలను ప్రభుత్వం ప్రకటించింది. కాగా.. కడపలో ఏసీబీ కార్యాలయంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సి.కిరణ్ ను పోలీసు సేవాపతకం వరించింది. ఈయన కానిస్టేబుల్‌గా 2004 ఫిబ్రవరి 10న జిల్లాలో విధుల్లో చేరారు.

నేడు ఎస్‌బీఐ శతాబ్ది ఉత్సవాలు

కడప కార్పొరేషన్: కడప ఏడురోడ్ల కూడలిలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి స్థాపించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నేడు శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ఖాతాదారులను సన్మానించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమరావతి, ఎల్‌హెచ్‌ఓ జనరల్ మేనేజర్ నెట్‌వర్క్–3 ఖాద్రీ గుండూరావు, కర్నూల్ ఏఓ డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖా మీనన్, ఎల్‌హెచ్‌ఓ అమరావతి, డిప్యూటీ జనరల్ మేనేజర్ క్రిష్ణ కుమార్ బి. ప్రభు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు కడప మెయిన్ బ్రాంచి అసిస్టెంట్ జనరల్‌మేనేజర్ ఆర్. అనిల్ కుమార్ తెలిపారు.

రామయ్య సన్నిధిలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు దర్శించుకున్నారు. వారికి ఆలయ టీటీడీ డెప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో స్వాగతం పలికి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి ఎంపీని కలిసి ఒంటిమిట్ట రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చూడాలని విన్నవించారు. వీరి వెంట టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, జిల్లా దేవాదాయ శాఖ ఏసీ శంకర్ బాలాజీ, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, సిద్దవటం వ్యవసాయ మార్కెటింగ్ వైస్ చైర్మన్ ముమ్మడి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



రామయ్య క్షేత్రంలో ఎంపీ అవినాష్ రెడ్డి. చిత్రంలో జడ్పీ చైర్మన్ ఆకేపాటి, మేయర్ సురేష్ బాబు

ఉన్నతాధికారుల ఆరా

'అసలు దొంగలు ఎవరో?' కథనంపై స్పందించిన మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్

సాక్షి ఎఫెక్ట్..

కడప రూరల్ : కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో కాంట్రాక్టు స్టాఫ్ నర్సు నియామకాలు జరిగాయి. ఈ నియామకాల్లో అభ్యర్థులు బోగస్ మార్కుల జాబితాతో మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో అధికారులు 15 మంది మార్కుల జాబితాపై డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి నివేదిక పంపగా, అందులో ఎనిమిది మంది సర్టిఫికెట్లు బోగస్‌గా తేలింది. ఇందుకు సంబంధించి 'సాక్షి'లో అసలు దొంగలు ఎవరో? శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనం ఆ శాఖలో కలకలం రేపడంతోపాటు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ నివాస్ తదితర ఉన్నతాధికారులు ఈ కథనంపై ఆ శాఖలో జరుగుతున్న వ్యవహారాలపై ఆరా తీసినట్లుగా తెలిసింది.

జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

కడప కార్పొరేషన్: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు ఇ.చైతన్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, పార్టీ నాయకులు జి.గరుడాద్రి, పాకా సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

విప్లవ యోధుడు జగజ్జీవన్ రామ్

కడప సిటీ: విప్లవయోధుడు జగ్జీవన్ రామ్ అని కలెక్టర్ విజయ రామరాజు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జగ్జీవన్ రామ్ జయంతి సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ అధ్యక్షతన జరిగాయి. కలెక్టర్ విజయ రామరాజుతో పాటు, జేసీ సాయికాంత్ వర్మ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయప్రకాష్, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ఈడీ వెంకటసుబ్బయ్య హాజరయ్యారు.

కడప అర్బన్: జగ్జీవన్ రామ్ మహనీయుడు అని ఎస్పీ అన్బురాజన్ కొనియాడారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ రామరాజు



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

క్లుప్తంగా

ఒంటిమిట్ట చెరువు వద్ద గజ ఈతగాళ్ల ఏర్పాటు

ఒంటిమిట్ట: మండల కేంద్రమైన ఒంటిమిట్టలో గల చెరువు వద్ద జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 15మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. ఈ విషయం జిల్లా మత్స్యకారుల సంఘం డైరెక్టర్ గుడి రమణ బుధవారం తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తుల రక్షణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు.

బైక్, ఆటో ఢీ

గోపవరం : కడప – నెల్లూరు సరిహద్దు సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మడకలవారిపల్లెకు చెందిన నారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. నారాయణ తన సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో నెల్లూరు జిల్లాకు వెళ్లి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది నారాయణను బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై రిమ్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

శివుడి సేవలో దేవదాయశాఖ అధికారి

పుల్లంపేట: పుల్లంపేటలోని శ్రీ పర్వతవర్ధినీ శాంతిలింగేశ్వరస్వామి దేవస్థానాన్ని బుధవారం అన్నమయ్య జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్ శివాలయాన్ని సందర్శించారు.స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. దాతలు ముందుకు వచ్చి ఆలయానికి మరింత సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఆలయంలో చోరీ

సంబేపల్లి : మండలంలోని శెటిపల్లె పంచాయతీ కొత్తపల్లె బిడికి సమీపంలో కొలువైన శ్రీ నాగారపమ్మ ఆలయంలో చోరి జరిది. ఎస్‌ఐ షరీఫ్ కథనం మేరకు మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారికి సంబంధించిన నగలు, హుండీని ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మైనర్, మరొకరిపై పోక్సో కేసు

బి.కొత్తకోట (అన్నమయ్య జిల్లా) : 10వ తరగతి విద్యార్థిని వేధించిన ఓ మైనర్, మరొకరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామమోహన్ బుధవారం తెలిపారు. మండలంలోని బడికాయలపల్లె గ్రామ పంచాయతీకి చెందిన బాలిక 10వ తరగతి తొలిరోజు పరీక్ష రాసి ఇంటికి వెళ్తూ తాను చదువుతున్న హైస్కూల్‌లోని ఉపాధ్యాయులతో మాట్లాడేందుకు వెళ్లింది. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు బాలిక ఆటో కోసం ఎదురుచూస్తుండగా బడికాయలపల్లెకు చెందిన మైనర్..బాలిక వద్దకు వచ్చి నిన్ను ప్రేమిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మైనర్‌తో పాటు వచ్చిన బడికాయలపల్లెకు చెందిన నిరంజన్ (23) బహిరంగ ప్రదేశంలో మాట్లాడటం వద్దని చెప్పి బాలికను బైక్‌లో కూర్చోబెట్టుకుని వెళ్లే ప్రయత్నంలో అరవడంతో రహదారిపై వెళ్తున్న వెంకటరమణ అనే వ్యక్తి చూసి దగ్గరకు రావడంతో ఇద్దరు పరారయ్యారు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జగదభిరామా.. రఘుకుల సోమా..



చంద్రుని సాక్షిగా కల్యాణానికి హాజరైన భక్తులు

ఒంటిమిట్ట కోదండరామయ్య బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. జానకిరాములు మనువాడే మధురఘట్టం చూసేందుకు భక్తులకు రెండు కళ్లు చాలలేదు. అశేష భక్తజనవాహినితో కల్యాణవేదిక కళకళలాడింది. కల్యాణరాముడిని దర్శించుకున్న భక్తులు జగదభిరామా.. రఘుకులసోమా కరుణను చూపవయ్యా అని వేడుకున్నారు. – ఒంటిమిట్ట



సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు



తెలుగు దనం ఉట్టిపడేలా స్వామివారి కల్యాణ వేదిక ఏర్పాటు



కల్యాణానికి తరలివస్తున్న భక్తులు



కళాకారుల కోలాటం

• గజేంద్రుడిపై శ్రీరాముడు



మాడవీధుల్లో ఊరేగుతున్న పట్టాభిరాముడు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరో రోజు బుధవారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణం తరువాత గజవాహనంపై శ్రీ సీతారాములు భక్తులకు అభయమిచ్చారు. సీతారాములు మాత్రమే కలిసి విహరించే ఈ వాహనానికి ఎంతో విశిష్టత ఉంది. కాగా బుధవారం ఉదయం శివధనుర్బాలంకారంలో శ్రీరాముడు దర్శనమిచ్చారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం నిర్వహించనున్నారు.

ఎమ్మెల్యేపై మాకు ఎలాంటి అసమ్మతి లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : కమలాపురం శాసన సభ్యుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డిపై తమకు ఎలాంటి అసమ్మతి లేదని కమలాపురం నియోజకవర్గ నేతలు వల్లూరు అరవింద్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, సీఎస్ నరేష్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల మూడో తేది సోమవారం వీరపునాయునిపల్లె మండలం గంగిరెడ్డిపల్లెలో వంశీధర్‌రెడ్డికి చెందిన తోటలో బోరులో నీళ్లు పడ్డాయని బంధువులు, స్నేహితులు, పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ పిలిచి విందు ఇచ్చినట్లు చెప్పారు. ఆ క్రమంలో శిబిరాలుగా విడిపోయి కూర్చున్నామన్నారు. దీన్ని కొన్ని పత్రికలు, మీడియాలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వీరంతా సమావేశమైనట్లు వార్తలు ప్రసారం కావడం దురదృష్టకరమన్నారు. దీన్ని తాము ఖండిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అంటే తమకు అభిమానమన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జరిగిన సంఘటనను టీడీపీ నాయకులు బలుపు అని పొరపడుతున్నారని ఎద్దేవా చేశారు. అందుకే ఇలా వాస్తవాలను వక్రీకరిస్తున్నారన్నారు. తమ పేర్లు పెట్టి వార్తలు రాయడం విచారకరమన్నారు. పార్టీలు మారాల్సిన అగత్యం తమకు పట్టలేదన్నారు. 2024లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి మూడోసారి రవీంద్రనాథ్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో హడలెత్తించిన లారీ డ్రైవర్

ముద్దనూరు : ముద్దనూరు నుంచి ఎర్రగుంట్ల వైపు ప్రయాణిస్తున్న లారీ డ్రైవర్ బుధవారం సాయంత్రం ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. వివరాలు.. మద్యం మత్తులో లారీ నడుపుతున్న డ్రైవరు జాతీయ రహదారిలో ఇష్టానుసారంగా డ్రైవింగ్ చేశాడు. సుమారు 8 కిలో మీటర్ల పాటు లారీ అదుపుతప్పి రోడ్డుపై నాట్యం చేస్తున్నట్లు వెళ్లింది. అయితే అదృష్టవశాత్తు రెండు ఆర్టీసీ బస్సులు ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి. చివరకు రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు ఎర్రగుంట్ల పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకోని మద్యం మత్తులో ఉన్న డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే భయభ్రాంతులకు గురైన ప్రజలు మద్యం మత్తులో ఉన్న డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు.

ద్రవిడ వర్సిటీ బీఓఎస్ సభ్యుడిగా మృత్యుంజయరావు



వైవీయూ : కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా వైవీయూ లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు నియమితులయ్యారు. ద్రవిడ విశ్వవిద్యాలయంలో జానపద, గిరిజన అధ్యయనాల విభాగం బీఓఎస్ సభ్యులుగా ఈయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. లలితకళల విభాగంలో, సిలబస్ రూపకల్పనలో విశేష అనుభవమున్న ఈయన దాదాపు 45 వరకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో కళలపై పరిశోధన వ్యాసాలను, పుస్తకాలను ప్రచురించారు. మృత్యుంజయరావు నియామకం పట్ల వైవీయూ వీసీ ఆచార్య జింక రంగజనార్ధన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఆచార్య ఏజీ దాము, ఆచార్య వై. సుబ్బరాయుడు, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశం కల్పించిన ద్రవిడ విశ్వవిద్యాలయం అధికారులు, ఆ విభాగాధిపతి ఆచార్య డి. శ్యామలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైభవం.. ఉరుసు ఉత్సవం



ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి, సోదరులు

కమలాపురం : కమలాపురంలోని దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా ఉరుసు మహోత్సవాలు దర్గా పీఠాధిపతి (ముతవల్లి), సజ్జాద్–ఏ–నషీన్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో, అశేష భక్త జన సందోహం నడుమ బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభ మయ్యాయి. గంధం ఇంటి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో నషాన్ జెండాను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రత్యేక డప్పు కళాకారుల వాయిద్యాల నడుమ యువత వివిధ రకాల నృత్యాలు చేశారు. తమిళనాడు నుంచి ప్రత్యేకంగా తెచ్చిన బాణా సంచా పేల్చారు. ఊరేగింపు అనంతరం నషాన్ జెండాను దర్గా ఆవరణంలో ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ ఉరుసు ఉత్సవాల ప్రారంభానికి సూచిక. రాష్ట్రం నలు మూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అశేష భక్త జనుల సమక్షంలో హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, దస్తగిరిషా ఖాద్రి, మౌలానా మౌల్వి మొహిద్దీన్ షా ఖాద్రి, హాజీ హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రిల మజార్లపై పూల చాదర్‌లు సమర్పించారు. ప్రత్యేక ఫాతెహ చేశారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరి షా ఖాద్రి, మౌలానా ఖాద్రి, గౌస్ పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్, గ్రామ ప్రజలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రి టి. హుసేన్ మియా కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

నేడు గంధం : కమలాపురం పెద్ద దర్గాగా విరాజిల్లుతున్న దర్గా–ఏ–గఫారియా ఖాదరియాలో గురువారం రాత్రి గంధం మహోత్సవం జరగనుంది. రాత్రి ప్రముఖ ఖవ్వాల్ ఉస్తాద్ సలీం ఝున్‌కార్, సరఫరాజ్ చిష్టిల మధ్య ఖవ్వాలీ పోటీ నిర్వహించనున్నారు.



నషాన్ జెండాను ఊరేగిస్తున్న భక్తులు

గంధోత్సవాన్ని తిలకించడం శుభదాయకం

ఉరుసు మహోత్సవాల్లో భాగంగా గంధోత్సవాన్ని తిలకించడం శుభదాయకం అని పీఠాధిపతి సోదరులు దస్తగిరి షా ఖాద్రి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ గంధం స్వామి వారి మజార్లపై ఎక్కించడంతో పాటు తమ ఇళ్లకు తీసుకెళితే రోగాలు నయమవుతాయన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె (అన్నమయ్య జిల్లా): వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వివిధ కారణాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు... కలకడ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన పుష్పావతి (30) కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. రెండేళ్ల క్రితం భర్త జనార్ధన్ అనారోగ్యంతో మృతి చెందాడు. తన ఇద్దరి పిల్లలను పోషించేందుకు కూలీ పనులకు వెళ్తోంది. అయితే అత్తింటివారు భర్త ద్వారా ఆమెకు సంక్రమించాల్సిన ఆస్తిలో వాటా ఇవ్వక పోవడంతో జీవితం మీద విరక్తి చెంది గులికల మందు తినింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పెద్దమండ్యం మండలం చదివేవాండ్లపల్లెకు చెందిన ఆంజినేయుడు (42) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. బుధవారం కుటుంబ సమస్యలపై భార్య సరస్వతితో గొడవ పడ్డాడు. అనంతరం మనస్థాపం చెంది పురుగుల మందు తాగాడు. మదనపల్లె మండలం వేంపల్లెకు చెందిన భాస్కర్ కుమార్తె (17) ఇంటర్ చదువుతోంది. ఇంటి పనులు సక్రమంగా చేయలేదని తల్లి గంగాదేవి మందలించింది. దీంతో మనస్థాపం చెందిన విద్యార్థిని బుధవారం పురుగుల మంది తాగింది.గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.



ఆటో డ్రైవర్ నిజాయితీ



పోలీసుల సమక్షంలో హ్యాండ్‌బ్యాగును అందజేస్తున్న ఆటో డ్రైవర్

నందలూరు (రాజంపేట) : పది రూపాయలు దొరికితే పక్కకు చూసి తీసుకొని జేబులో వేసుకునే మనుషులున్న నేటి సమాజంలో తన ఆటోలో ఓ మహిళ మరిచిపోయిన నగదును తిరిగి ఆమెకు అప్పగించి ఆటో డ్రైవర్ బాలిపోగురాజా తన నిజాయితీని నిరూపించుకున్నాడు. ఈ సంఘటన బుధవారం నందలూరులో జరిగింది.వివరాలు..పాటూరుకు చెందిన తురక మనోహర్, కుమార్తె అఖిల ఒంగోలులో చదువుతోంది. స్కూల్ ఫీజు కట్టడానికి నాన్న వద్ద రూ. 4వేలు తీసుకుంది. నగదను హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకుంది. పని నిమిత్తం ఆటోలో వెళుతూ హ్యాండ్‌బ్యాగ్ మరిచిపోయింది. గమనించిన ఆటో డ్రైవరు కోనరాజుపల్లెకు చెందిన బాలిపోగురాజా బ్యాగ్ తీసుకుని స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు అప్పజెప్పారు.పోలీసుల సమక్షంలో హ్యాండ్‌బాగ్‌ను మహిళకు అప్పగించారు. ఆటో డ్రైవర్‌ను హెడ్‌కానిస్టేబుల్ షామీర్, పోలీసులు దర్బార్‌బాషా, రహీం, స్థానికులు అభినందించారు.

ఈతకు వెళ్లి.. అనంతలోకాలకు

లక్కిరెడ్డిపల్లి : అన్నమయ్య జిల్లా కాకులవరం సమీపంలోని బావిలోకి నలుగురు యువకులు ఈతకువెళ్లారు. వారిలో తిరుపతి దేవేంద్ర (17) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ వినోద్ కుమార్ కథనం మేరకు రాయచోటి మంగళ కాలనీకి చెందిన యువకులు ఆటోలో కాకులవరం సమీపంలోని బావి వద్దకు ఈతకు వచ్చారు. మద్యం తాగి బావిలో ఈత కొట్టేందుకు దిగారు. బావిలోకి దిగిన దేవేంద్ర అనే యువకుడు ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో మిగిలిన యువకులు గట్టిగా కేకలు వేశారు. దీంతో చుట్టు ప్రక్కల వారు బావిలోకి దిగి దేవేంద్ర కోసం గాలించారని ఎస్‌ఐ తెలిపారు.ఇప్పటి వరకు ఆచూకీ లభించలేదన్నారు.

విద్యార్థిని కొట్టిన టీచర్

బి.కొత్తకోట (అన్నమయ్య జిల్లా) : బి.కొత్తకోట బాలిక జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఓ ఉపాధ్యాయిని మూడో తరగతి విద్యార్థిని కొట్టడం చర్చనీయాంశమైంది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో విచారణ చేపట్టారు. స్థానిక తూర్పు ప్రాథమిక పాఠశాలలో రంగసముద్రంరోడ్డుకు చెందిన గోపిక చదువుతోంది. ఇదే పాఠశాలలో ఉపాధ్యాయినిగా రాజారమ విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం మూడో తరగతిలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయిని గణితం ఎక్కాలు చెప్పాలని కోరారు. విద్యార్థిని గోపిక చెప్పలేకపోవడంతో రాజారమ స్కేలుతో కొట్టింది. ఈ దెబ్బలకు శరీరం కమిలిపోయింది. తల్లిదండ్రులు విషయాన్ని హైస్కూల్ హెచ్‌ఎం భువనేశ్వరీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. మదనపల్లె డీవైఈఓ కృష్ణప్ప ఘటనపై ఆరా తీసి ఎంఈఓ రెడ్డిశేఖర్‌కు వివరాలు కోరారు. కొట్టిన ఉపాధ్యాయిని సంజాయిషీ ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. దీనిపై రాజారమ మాట్లాడుతూ జరిగిన ఘటనపై గోపిక తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పానని, ఉద్దేశపూర్వకంగా కొట్టలేదని చెప్పారు.